క్లుప్తంగా

నోటు పుస్తకాల అందజేత


నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్: చంద్రగిరి గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మంజునాథ్ రెడ్డి తన జన్మదినాన్ని పురస్కరించుకుని గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం ఉచితంగా నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం మధు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు


జమ్మానిపల్లిలో వేసిన బోరు వద్ద గంగపూజ చేస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని గ్రామాల్లో వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టామని జెడ్పీటీసీ సరోజమ్మ తెలిపారు. జమ్మానిపల్లి, తురుకువాండ్లపల్లి గ్రామాల్లో జేజేఎం పథకం కింద కొత్తగా తవ్వించిన బోర్లలో మంచి నీరు సమృద్ధిగా లభించడంతో గురువారం ఆమె గంగపూజ నిర్వహించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ గ్రామాల ప్రజలు వేసవిలో తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా ముందు జాగ్రత్తగా ప్రభుత్వం బోర్లు వేయిస్తుందని తెలిపారు. సర్పంచ్ పుట్టమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ ప్రజలుపాల్గొన్నారు.

ఉపకులపతిగా కొలకలూరి మధుజ్యోతి నియామకంపై హర్షం


కొలకలూరి మధుజ్యోతి

పెనుకొండ: తిరుపతిలోని పద్మావతి వర్సిటీలో తెలుగు ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆచార్య కొలకలూరి మధుజ్యోతిని కుప్పం ద్రావిడ వర్సిటీ ఉపకులపతిగా నియమించడంపై ప్రముఖ కవి, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా ప్రధాన కార్యదర్శి, డాక్టర్ శివన్న గురువారం హర్షం వ్యక్తం చేశారు. మధుజ్యోతి పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ కుమార్తె అని తెలిపారు. ఉపకులపతులుగా పని చేసే అదృష్టం తండ్రి, కుమార్తెలిద్దరికీ లభించడం అదృష్టమన్నారు.

నేడు జనసంపర్క సభలు

పావగడ: స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం జనసంపర్క సభలు నిర్వహించనున్నట్లు తాలూకా రూరల్ కాంగ్రెస్ అధ్యక్షుడు రామాంజినప్ప గురువారం తెలిపారురు. సాసలకుంట, వదనకల్లు గ్రామ పంచాయతీలకు సంబంధించి లింగదహళ్లిలోని వీఎస్ఎస్ఎన్ సొసైటీ ఆవరణలో సభ జరుగుతుందన్నారు. తాలూకా స్థాయి అధికారులు పాల్గొంటారని, సమస్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తారన్నారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించాలని సూచించారు.

భగవద్గీత పఠన పోటీల్లో మడకశిర విద్యార్థినుల ప్రతిభ


విజేతలు ప్రణతి, లహరిని అభినందిస్తున్న దృశ్యం

మడకశిర: గీతా జయంతిని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో అనంతపురంలో భగవద్గీత పఠనంపై ఇటీవల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. మడకశిరకు చెందిన విద్యార్థినులు ప్రణతి, లహరి పాల్గొని భగవద్గీతను తప్పులు లేకుండా చదివి విజయం సాధించారు. ప్రణతి ప్రథమ బహుమతి, లహరి ద్వితీయ బహుమతిని సాధించినట్లు వారికి శిక్షణ ఇచ్చిన టీచర్ గీతావాణి తెలిపారు.

వైభవంగా అయ్యప్ప స్వామి మండల పూజ


భక్తి గీతాలు ఆలపిస్తున్న అయ్యప్ప భక్తులు

పరిగి: మండల కేంద్రం పరిగిలో అయ్యప్ప స్వామి మండల పూజ కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. అయ్యప్ప భక్త మండలి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ చేపట్టి విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప మాలధారులు గురుస్వాముల నేతృత్వంలో భక్తిగీతాలు ఆలపించారు. తర్వాత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రికి అయ్యప్ప స్వామి ఉత్సవమూర్తిని ఊరేగించారు.

జోష్ నింపుతున్న 'ఆడుదాం ఆంధ్రా'

గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభ వెలికి తీసేందుకు నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు విద్యార్థుల్లో జోష్ పెంచుతున్నాయి. విద్యార్థులు తరగతి గదుల నుంచి మైదానాల్లోకి పరుగులు తీసి క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని చెలరేగుతున్నారు. ప్రత్యర్థులకు చెమటలు పట్టిస్తున్నారు. క్రికెట్ పోటీల్లో బంతులను బౌండరీలు దాటిస్తున్నారు. ఏ మైదానం చూసినా వందలాది మంది విద్యార్థులతో కళకళలాడుతోంది. పోటీలను వీక్షించేందుకు వచ్చిన విద్యార్థులు, ప్రజలు ఈలలు, కేరింతలతో క్రీడాకారులను ఉత్తేజ పరుస్తున్నారు. ఈనెల 26న అట్టహాసంగా ప్రారంభమైన 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు గురువారం మడకశిర, హిందూపురం, పెనుకొండ నియోజకవర్గాల్లో కొనసాగాయి.


మడకశిర మండలం సీ కొడిగేపల్లిలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

హిందూపురం: యువత, విద్యార్థులు తమలోని క్రీడా ప్రతిభను కనబరచాలని హిందూపురం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. గురువారం పట్టణంలోని ఎంజీఎం పాఠశాల క్రీడా మైదానంలో మూడవ రోజు ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను చైర్‌పర్సన్ ప్రారంభించారు. క్రికెట్ మ్యాచ్ సందర్భంగా టాస్ వేసి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభావంతులను గుర్తించి జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారన్నారు. పోటీలను సద్వినియోగం చేసుకొని ఉత్తమ ప్రతిభ కనబరచాలని విద్యార్థులకు సూచించారు. పీడీ లోక్‌నాథ్, పీఈటీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మడకశిరరూరల్: మండలంలోని ఏఆర్‌రొప్పం, చెందకచెర్లు, గోవిందాపురం, సీ కొడిగేపల్లి గ్రామ సచివాలయాల పరిధిలో గురువారం అడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు ఉత్సాహంగా జరిగాయి. పెద్ద సంఖ్యలో విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. సర్పంచులు గీత, ప్రభావతిబాయి, ఎంపీటీసీలు బాగ్యాబాయి, కామరాజు పాల్గొన్నారు.

అగళి: మధుడి గ్రామ వద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం వాలీబాల్ పోటీలు కొనసాగాయి. మధుడి టీం-1,టీం-2 మధ్య జరిగిన పోటీల్లో టీం-2 జట్టు విజయం సాధించింది. విజేతలను సర్పంచ్ శివకుమార్ అభినందించారు.

రొద్దం: ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, తహసీల్దార్ అనంతచారి పర్యవేక్షణలో మండల వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాల పరిధిలోని గురువారం కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ తదితర క్రీడా పోటీలను నిర్వహించారు. రొద్దం సచివాలయం-1 పరిధిలో బ్యాడ్మింటన్ పోటీల్లో సాయికిణ్, నూర్‌మహ్మద్, జిలాన్, మూజాబిల్ జట్లు తలపడగా సాయి కిరణ్, నూర్‌మహ్మద్ జట్టు విజయం సాధించినట్లు పంచాయతీ కార్యదర్శి జనార్ధన్ తెలిపారు.

గుడిబండ: సీఎం జగన్ విద్యతో పాటు క్రీడల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారని ఎంపీపీ రాధమ్మ అన్నారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా గురువారం క్రీడా పోటీలు కొనసాగాయి. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. వాలీబాల్ పోటీల్లో దేవరహట్టి సచివాలయ పరిధిలో ఉన్న జీఎస్ తండా, కబడ్డీ పోటీల్లో దేవరహట్టి జట్లు విజేతగా నిలిచాయి. విజేతలను మండల కన్వీనర్ డీల్ యంజారేగౌడ్, జేసీఎస్ కన్వీనర్ శివకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందించారు.

పెనుకొండ రూరల్: మండలంలోని మనిమడుగు, మావటూరు, నాగలూరు, రాంపురం పంచాయతీల్లో గురువారం క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు.

రొళ్ల: దొమ్మరహట్టి గ్రామ వద్ద ఉన్న డాక్టర్ అంబేడ్కర్ గురుకుల బాలుర రెసిడెన్సియల్ స్కూల్ ఆవరణలో పోటీలు ఉత్సహంగా కొనసాగాయి. హులికుంట సచివాలయ టీం-1, గురుకుల పాఠశాల జట్ల మధ్య జరిగిన వాలీబాల్ పోటీల్లో గురుకుల పాఠశాల విద్యార్థులు విజయం సాధించారు. క్రికెట్ పోటీల్లో హులికుంట టీం-1, టీం-2 పోటీపడగా టీం-1 విజయం సాధించింది. మరొక టీం-3, టీం-4 పోటీపడగా టీం-4 గెలుపొందింది. విజేతలను ప్రిన్సిపాల్ మైలారప్ప, సర్పంచ్ కరియమ్మ, వైస్ సర్పంచ్ రవికుమార్, నాయకుడు డి.రవికుమార్ అభినందించారు. హులికుంట సచివాలయ ఇన్‌చార్జ్ కోకిల, గురుకుల పాఠశాల పీడీ చంద్రశేఖర్, పీఈటీ మోహన్ పాల్గొన్నారు.

గోరంట్ల: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో కొండాపురం, కమ్మవారిపల్లి, పులేరు గ్రామ సచివాలయ పరిధిలోని విద్యార్థులకు క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు.

పరిగి: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటూ ఏపీఆర్ఎస్ కొడిగెనహళ్లి తదితర విద్యాసంస్థల్లో క్రీడా పోటీలు నిర్వహించి విజేతలను మండల స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. తహసీల్దారు సౌజన్యలక్ష్మీ, ఎంపీడీఓ సరస్వతి, ఎంఈఓ లక్ష్మీదేవి, శేషాచలం, నోడల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అమరాపురం: హేమావతి పాఠశాలలో క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఎంపీడీఓ మునిస్వామి హాజరై మాట్లాడారు. అన్ని పాఠశాలల పైకి హేమావతి పాఠశాల క్రీడా పోటీల్లో ముందంజలో ఉందన్నారు. ఎంపీపీ ఈరన్న, పంచాయతీ కార్యదర్శి నరేష్, పీఈటీ వెంకటరమణప్ప, సర్పంచ్ తిప్పేస్వామి, ఎంపీటీసీ జయరామప్ప, ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ్, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు


అమరాపురంలో ఖోఖో పోటీలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న హిందూపురం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ


మడకశిర మండలం ఏఆర్ రొప్పంలో క్రీడా సామగ్రిని అందజేస్తున్న దృశ్యం


అగళి: మధుడిలో వాలీబాల్ పోటీలు


రొద్దం: విజయం సాధించిన జట్టుతో అధికారులు


పరిగి: ఏపీఆర్ఎస్ పాఠశాలలో బ్యాడ్మింటన్ పోటీలు


గోరంట్ల: క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం


రొళ్ల: అంబేద్కర్ గురుకుల బాలుర రెసిడెన్సియల్ పాఠశాలలో వాలీబాల్ పోటీలు


పెనుకొండ మండలం రాంపురంలో క్రీడా సామగ్రిని అందజేస్తున్న దృశ్యం


పెనుకొండ మండలం రాంపురంలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

జగనన్నను మరోమారు ఆశీర్వదించండి


ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న సమన్వయకర్త దీపిక

- హిందూపుర నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక

చిలమత్తూరు: వచ్చే ఎన్నికల్లో సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. మండలంలోని టేకులోడు పంచాయతీ నల్లబొమ్మనపల్లిలో గురువారం జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధిని వివరించారు. సమస్యలపై ఆరా తీశారు. అనంతరం దీపిక మాట్లాడుతూ నవరత్నాలు ద్వారా పేదల సంక్షేమానికి జగనన్న అనేక పథకాలు అమలు చేశారన్నారు. అర్హులందరికీ పథకాలు అందేలా వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. ఎన్నికల సమయంలో, పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేశారన్నారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చారన్నారు. పాలనను ప్రజల ముంగిటికే తీసుకువచ్చారన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోమారు జగనన్నను ఆశీర్వదించి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎంపీటీసీ కవిత, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్వామివార్లకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలోశ్రీలక్ష్మీనరసింహస్వామి

మడకశిరరూరల్: భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లెడుగుంట శ్రీ ఆంజనేయస్వామి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై తలనీలాలు సమర్పించి స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.వివిధ గ్రామాల భక్తులు జ్యోతులను సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. గరుడోత్సవంలో భాగంగా స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను పూలపల్లకీలో ఉంచి జిల్లెడుగుంట ఆంజినేయస్వామి దేవాలయం నుంచి భక్తరపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం వరకు ఊరేగించారు. దేవాలయశాఖ, రథోత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. అర్చకులు భక్తులకు ప్రసాద వినియోగం చేశారు.

నేడు కంబాల నరసింహస్వామి జ్యోతుల పరుష

జిల్లెడుగుంట గ్రామ సమీపంలో వెలిసిన కంబాల శ్రీనరసింహస్వామికి శుక్రవారం జ్యోతుల ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామాల ప్రజలు జ్యోతులను ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామివారికి సమర్పిస్తారని తెలిపారు.


మామిడిచెట్ల నరికివేత


నరికివేసిన చెట్లను చూపుతున్న రైతు

చెన్నేకొత్తపల్లి: మండలంలోని న్యామద్దెలకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నరసింహులుకు చెందిన మామిడి చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి నరికివేశారు. బాధితుడు తెలిపిన మేరకు..పదేళ్ల నుంచి మామిడిచెట్లను సంరక్షిస్తున్నట్లు తెలిపాడు. కోతకు వచ్చిన సందర్భంలో గుర్తు తెలియని వ్యక్తులు 15 చెట్లు వరకు నరికి వేశారన్నారు.

ట్రెక్కింగ్‌లో సత్తా చాటిన విద్యార్థులు


ప్రతిభ చాటిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు, ఆర్మీ అధికారి అరుణ్‌బాబు


ట్రెక్కింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

పరిగి: మండలంలోని ఏపీఆర్ఎస్ కొడిగెనహళ్లి పాఠశాల విద్యార్థులు ఆల్ ఇండియా ట్రెక్కింగ్ క్యాంపులో పాల్గొని సత్తా చాటారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన డైరెక్టరేట్ తరపున ఈనెల 15 నుంచి 22 వరకూ కర్ణాటక రాష్ట్రం బెళగావిలో జరిగిన ట్రెక్కింగ్ పోటీల్లో ఎన్‌సీసీఆర్మీ విభాగం తరపున పాఠశాలకు చెందిన మనోజ్‌కుమార్, సాయి భరత్‌రెడ్డి, చరణ్‌తేజ, రోహిత్‌నాయక్, విజయ్, హర్షవర్ధన్ పాల్గొన్నారు. వీరంతా ట్రెక్కింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసి తిరిగి వచ్చిన సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు గురువారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ ట్రెక్కింగ్‌లో ప్రతిభచాటి పాఠశాల కీర్తి ప్రతిష్టలను పెంచారని కొనియాడారు. ఎన్‌సీసీ అధికారి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ దేశ విదేశాల విద్యార్థులతో పాటూ ఏపీఆర్ఎస్ కొడిగెనహళ్లి పాఠశాల విద్యార్థులకు దక్కిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నామన్నారు.

మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలి


కుట్టుమిషన్లు అందజేస్తున్న ఎంపీడీఓ తదితరులు

హిందూపురం అర్బన్: మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలని ఎంపీడీఓ నరేంద్ర సూచించారు. తూమకుంట చెక్‌పోస్టు వద్ద వాసవ్వ మహిళా మండలి ఆధ్వర్యంలో ఉషసిలై స్వావలంబన, స్మాల్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో ఆ ప్రాంత పేద మహిళలకు 9 రోజుల పాటు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసిన 25మంది మహిళలకు గురువారం ఉచితంగా కుట్టుమిషన్లు, మెటీరియల్ అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీఓ మాట్లాడుతూ టైలరింగ్ ద్వారా ఇంటి వద్దనే ఉంటూ ఉపాధి పొందవచ్చన్నారు. గ్రామ కార్యదర్శి కెంచరాయప్ప, కంపెనీ డిప్యూటీ మేనేజర్ రాజ్‌కుమార్, శివయ్య, ఆలందార్, మున్నా, కుశాల్ పాల్గొన్నారు.

మంచు కురిసే వేళలో..


హిందూపురం: బైపాస్‌రోడ్డును కప్పేసిన మంచు


హిందూపురం పోలీసు క్వార్టర్స్ లైన్‌లో...


చిలమత్తూరు: 544ఈ జాతీయ రహదారిపై ఉదయం ఏడుగంటల సమయంలో లైట్ల వెలుతురులో ప్రయాణిస్తున్న వాహనాలు

హిందూపురం/చిలమత్తూరు: జిల్లాలో చలివాతావరణం అంతకంతకూ పెరుగుతోంది. ముఖ్యంగా హిందూపురంతో పాటు పరిసర ప్రాంతాలను దట్టమైన మంచు కప్పేస్తోంది. ఉదయం 8 గంటల వరకూ మంచు తెరలు తొలగిపోవడం లేదు. సాయంత్రం 6 గంటల తర్వాత చలి తీవ్రత పెరుగుతోంది. చలివాతావరణంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి కూడా ఆసక్తి చూపడం లేదు. రోడ్లు, పరిసరాలను పొగ మంచు కప్పేస్తుండటంతో దగ్గరకు వస్తేగాని వాహనాలు, మనుషులు కనిపించడం లేదు. దట్టమైన పొగమంచుతో వాహనాల లైట్లు వేసుకుని నడవాల్సి వస్తోందని వాహనదారులు చెబుతున్నారు.

దీక్షలు విరమించిన బీఎస్పీ నాయకులు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పావగడ: తిరుమణి సోలార్ ప్రాజెక్ట్‌లో స్థానికులకు అధిక శాతం ఉద్యోగాలు కల్పిస్తామని సోలార్ పార్క్ మేనేజర్ మహేశ్ హామీ ఇవ్వడంతో తాలూకా కార్యాలయం వద్ద రెండు రోజులుగా దీక్ష చేస్తున్న తాలూకా బీఎస్పీ నాయకులు గురువారం ఆందోళన విరమించారు. మేనేజర్ మహేశ్ మాట్లాడుతూ విద్యార్హత ఆధారంగా 1400 మందికి ఉద్యోగాలు ఇవ్వగా అందులో 800 మంది స్థానికులు ఉన్నారన్నారు. మరో 400 మందికి టెక్నికల్ ఉద్యోగాలు అందించామన్నారు. త్వరలోనే మరిన్ని ఉద్యోగాలు స్థానికులకు ఇస్తామన్నారు. అనంతరం వివిధ డిమాండ్లపై బీఎస్పీ తాలూకా అధ్యక్షుడు హనుమంతరాయ, నాయకులు తహసీల్దార్ వరదరాజుకు వినతిపత్రం ఇచ్చారు. తహసీల్దార్ మాట్లాడుతూ 164 ఎకరాల ప్రభుత్వ భూమి బీడీఓ ఆధీనంలోకి వెళ్లాక నిరుపేద రైతులకు భూములను ఖాతా చేస్తామని అన్నారు. ఇళ్ల లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు అందిస్తామన్నారు.